# మానేరు జనత®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

8.4.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 348 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## ముంబైపై రాయల్స్ ఘన విజయం



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# విజయన్, మోడీ మంచి మిత్రులు

### రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
### కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
### ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు



**జనతా న్యూస్, తిరువనంతపురం :** కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల

మిగతా 2 లో

## రేవంత్ సవాల్‌ను తిప్పికొట్టిన పినరయ్

### తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుంటారని ఎద్దేవా





# మీ పాలన అంతా బోగస్

## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

పరిగిలో భూములు లాక్కునే యత్నం
సీఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు
పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్
శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు

వివరాలు 3 లో

పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు.

03

## రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూ దందా
బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం
హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం



# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

### యూరియా యాప్‌పై హర్షం వ్యక్తం చేసిన రైతులు
### అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది మంత్రి తుమ్మల



దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు.

02

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

### కర్రెగుట్టల్లో స్వేచ్ఛగా తిరిగే వెసులుబాటు
### మావోయిస్టు అడ్డాలో అభివృద్ధి పరుగులు
### రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



## శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ
ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే
ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన

04

## బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
రెచ్చగొట్టే ప్రకటనలై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

# ఇరాన్ నాగరికత అంతమై పోవడం ఖాయం

ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

## గడువుకు ముందే దాడులు

ఖర్గ్ ద్వీపంపై బాంబులు
చూస్తూ ఊరుకోమని ఇరాన్ హెచ్చరిక

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 8 ఏప్రిల్ 2026


# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

## కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు

## మావోయిస్టు అడ్డాలో అభివృద్ధి పరుగులు : రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



**ములుగు,ఏప్రిల్7 :** తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

# ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

## బెట్టింగ్ యాప్ ఉచ్చులో పడకండి

## నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొ÷ళ్లైను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా ఞాశిIసఞసతిప।.ఐనీల.తిని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

## పదిమంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

**ఖమ్మం,ఏప్రిల్7 :** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సును వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 10 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థులను బస్సు నుంచి బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వేగంగా సహాయక చర్యలు చేపట్టారు. విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, లారీని స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు. పాఠశాల వాహనాల డ్రైవర్లు , భారీ వాహనాల డ్రైవర్లు రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# ఎసిబికి చిక్కిన అగ్రి వర్సిటీ అసోసియేట్ డీన్

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఎన్ని దాడులు జరుగుతున్నా లంచావతారాలు మారడం లేదు. నిత్యం ఎక్కడో చోట లంచగొండులు పట్టుబడుతూనే ఉన్నారు. ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

# మొక్క కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఖమ్మం,ఏప్రిల్7 :** కూసుమంచి మండలంలోని జీర్ల చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. చేగుమ్మ సహకార సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విజయన్, మోడీ మంచి మిత్రులు

మొదటి పేజీ తరువాయి

ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.



## రేవంత్ సవాల్‌ను తిప్పికొట్టిన పినరయ్

### తెలంగాణలో మా పార్టీ వారు చూసుకుంటారని ఎద్దేవా

**తిరువనంతపురం :** తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నేతలు అక్కడ రేవంత్ వ్యవహారంపై మాట్లాడుతారని అన్నారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై

చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ' మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

## పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్7 :** తెలుగు రాష్ట్రల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

# ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్

## 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷-లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.

# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

## యూరియా యాప్‌పై హర్షం వ్యక్తం చేసిన రైతులు

## అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది మంత్రి తుమ్మల



**హైదరాబాద్,ఏప్రిల్7 :** దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు పంటల కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా.. ఈ రోజు నిర్వహించి రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సచివాలయం నుండి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రిగారు.. యూరియా యాప్ మరియు యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్ తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్ ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్ తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని, రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రిగారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధిక యూరియా వాడకం ద్వారా వచ్చే అనర్థాలను రైతులకు మంత్రి వివరించారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందని అన్నారు. సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.

# మీ పాలన అంతా బోగస్

**ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ**

**పరిగిలో భూములు లాక్కునే యత్నం**

**సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు**

**పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్**

**శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు**



**హైదరాబాద్,ఏప్రిల్7 :** పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావుతో కలిసి ఆయన పరిగికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. పరిగికి చేరుకోకుండా హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. రైతులకు భరోసాగా వెళ్తున్న హరీశ్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పోలీసుల తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అప్పా జంక్షన్ వద్ద అడ్డుకుని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పాలన రాక్షస పాలనగా మారిందని విమర్శించారు. పరిగిలో అన్యాయానికి గురైన రైతులకు భరోసా ఇవ్వడానికి వెళ్తున్న మమ్మల్ని అడ్డుకొని, అన్యాయంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికక్కడ దళిత, గిరిజన, బలహీనుల భూములు లాక్కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తుందని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించడానికి కూడా వెళ్లనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## రైతులను పరామర్శించకుండా అడ్డుకుంటారా

**ఇంత నిరంకుశంగా వ్యవహరించడం సరికాదు**

**హరీష్ రావు అరెస్ట్‌ను ఖండించిన బిఆర్ఎస్ నేతలు**

పరిగి పర్యటనకు వెళ్లకుండా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును అడ్డుకోవడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హరీశ్‌రావు గృహ నిర్బంధం అక్రమమని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని తెలిపారు. తప్పు చేయకుంటే ఈ సర్కార్‌కు భయమెందుకు అని ప్రశ్నించారు. రైతుల పక్షాన పోరాడితే అడ్డుకుంటారా నిలదీశారు. అధికారం చేతిలో ఉందని ఈ ప్రభుత్వం అక్రమంగా రైతుల భూముల చెరబడుతున్నదని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రెండున్నరేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ వచ్చింది లేదు .. ఒక్క ఇటుక పేర్చింది లేదని విమర్శించారు. కానీ భూసేకరణ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుం దని మండిపడ్డారు. తమ భూముల కోసం పోరాడుతున్న రైతులకు భరోసా ఇవ్వడం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ నిర్బంధం సిగ్గు చేటు అని విమర్శించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు .. కాంగ్రెస్ నేతలు భూములను దోచుకుంటున్నారని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఎంత అణచివేసినా ప్రజలు, రైతుల తరపున ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. బాధిత రైతులను కలిసేందుకు వెళ్లకుండా హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై ఆంక్షలు, హౌస్ అరెస్టులపై మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత భయం అని ప్రశ్నించారు. అక్రమంగా పేదల భూములను గుంజుకుంటున్న ప్రభుత్వం.. బాధితులను కలవడానికి వెళ్తుంటే ఇన్ని నిర్బంధాలా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతుందని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. రైతుల పక్షాన పోరాటం చేస్తే అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలకు, చేతలకు పొందన లేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న హరీశ్‌రావు అంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజల పాలిట శాపంగా మారుతున్న పాలన అని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా మీ అవినీతిని బయటపెడుతూనే ఉంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

**బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల**

**నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రంలో పిసిసి చీఫ్**




**నాగర్ కర్నూల్,ఏప్రిల్7 :** తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందంరని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయం డంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళు ,, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

**9వ తేదీ నుంచి 29 వరకు అమలు**

**కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల**

**న్యూఢిల్లీ,ఏప్రిల్7 :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి.

కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5.00గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

**ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూ దందా**

**బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం**

**హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం**



**హైదరాబాద్,ఏప్రిల్7 :** ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక**



**సూర్యాపేట,ఏప్రిల్7 :** అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉ oదని తెలిపారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తమ ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుబాటులో 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని తెలిపారు. అంతకుముందు హుజూర్ నగర్ రామస్వామి గట్టు సమీపంలో ఐటీ కాలేజీతో పాటు మోడల్ కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. కాలనీ నిర్మాణానికి రూ.125 కోట్లు ఖర్చు, అదనంగా రూ.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదటి విడతలో 1500 మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆటోల ఎల్పీజీకి కొరత రాకూడదు

**ఎల్పీజి సరఫరా కంపెనీతో కమిషనర్ సమీక్ష**

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఆటో ఎల్పీజీ తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్ (÷ూబు।స ఉజీబ), గో గ్యాస్ (ఉనీ ఉ జీబ), టోటల్ ఎనర్జీస్ (÷ునీబిజీ ఇని।సణతి।బ), ప్రైమ్ ఫ్యూయల్ (ఖసతిప। ఈబీ।) కంపెనీలు చేసిన కృషిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందనలు తెలిపారు. పని తీరు ఏ మాత్రం మెరుగు పరుచుకోని పలు కంపెనీల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి, బంకులన్నింటిలో సరఫరా చేయాలని కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. బంకులకు గ్యాస్ వస్తున్న లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతి రోజు పర్యవేక్షిస్తుందని కమిషనర్ స్టీఫెన్ రవీందర్ వెల్లడించారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

# మీడియా సంస్థలపై దాడులు సరికాదు: రామ్

**హైదరాబాద్,ఏప్రిల్7 :** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మీద వైసీపీ నేతలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం సరైన పద్ధతికాదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కేసీఆర్ హయాంలో ఉన్నప్పుడు ఇదే తరహా దాడులు చేసేవారని ప్రస్తావించారు. రాజకీయ విమర్శలు ఉంటే రాజకీయంగా చూసుకోవాలని.. బెదిరింపు ధోరణి సరికాదన్నారు. బాధ్యతాయుతమైన సంస్థపై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తున్నామని రామచందర్ రావు పేర్కొన్నారు.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

**9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ**

**ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే**

**ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన**



**న్యూఢిల్లీ :** ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళకకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దీన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్**

**రెచ్చగొట్టే ప్రకటనలైె మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అభిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఈ యేడు వర్షాలు అంతంత మాత్రమే

**సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదు.. వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి**

**న్యూఢిల్లీ :** భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. నైరుతి రుతువపనాలు కొనసాగే వర్షాకాలం రెండో భాగమైన జూన్-సెప్టెంబర్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల కాలంలో దీర్ఘకాలిక వర్షపాతం సగటున 868.6 మిల్లీమీటర్లు కాగా, అందులో 94 శాతం వర్షాలు మాత్రమే పడే అవకాశాలున్నాయని తెలిపింది. 2026 వర్షాకాలం సీజన్‌లో నమోదయ్యే వర్షపాతం అంచనాలను భారత వాతావరణ శాఖ వచ్చే వారంలో విడుదల చేయనుంది. భారత్‌లో ఏడాదిలో నమోదయ్యే వర్షపాతంలో దాదాపు 70 శాతం వరకూ నైరుతి రుతుపవనాల వల్లే సాధ్యమవుతుంటుంది. నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ వరి, పత్తి, చెరుకు సహా ఖరీఫ్ పంటల సాగుకు కీలకమవుతాయి. సాధారణంగా జూన్ 1 లేదా మొదటి వారంలో కేరళను రుతుపవనాలు తాకి, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశమంతటా విస్తరిస్తాయి. కాగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వచ్చే ఈశాన్య రుతుపవనాలు స్వల్పకాలికమే అయినా అగ్నేయ భారతదేశానికి, ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఈ వర్షాలు కీలకం. శీతాకాలంలో మధ్యధరా ప్రాంతం నుంచి వచ్చే అల్పపీడన వ్యవస్థల కారణంగా తేలిక పాటి నుంచి భారీ వర్షాలు, మంచు కురియడానికి కారణమవుతుంటాయి. అయితే ఈ వర్షాలు ఉత్తరభారతదేశంలో కీలకమైన రబీ పంటలు, ముఖ్యంగా గోధుమలకు చాలా ఉపయోగకరం.

# ఇరాన్ నాగరికత అంతమై పోవడం ఖాయం

**ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు**

**హర్మ్యూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు**

**మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్**



**వాషింగ్టన్,ఏప్రిల్7 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మ్యూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# గడువుకు ముందే దాడులు

**ఖర్గ్ ద్వీపంపై బాంబులు**

**చూస్తూ ఊరుకోమని ఇరాన్ హెచ్చరిక**

**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత చేదాటుతున్నాయి. ట్రంప్ హెచ్చరించినట్లుగానే గడువుకు ముందే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేపట్టాయి. విద్యుత్ ప్లాంట్లు, బ్రిడ్జిలు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపంపై కూడా అమెరికా క్షిపణి దాడులు చేసింది. అలాగే కరాజ్ నగరంలో విద్యుత్ ప్లాంట్‌పై దాడి చేయగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చమురు కేంద్రమైన ఖర్గ్ ద్వీపాన్ని లక్ష్యంగా చేసుకుని పలు దాడులు జరిగాయని ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ పేర్కొంది. ఇక ఇరాన్‌లో రైల్వే సర్వీసులు కూడా నిలిచిపోయాయి. ఇరానీయులు రైళ్ల ప్రయాణాలకు దూరంగా ఉండాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. అంటే రైళ్లను ఇజ్రాయెల్ టా÷-గ్గ÷ట్ చేసుకుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ ముందుగా స్టేషన్లు, రైలు సర్వీసులను నిలిపివేసింది. ఫిబ్రవరి 28 నుంచి పశ్చిమాసియా యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. అంతేకాకుండా పలువురు కీలక నేతలు కూడా చనిపోయారు. అప్పటి నుంచి ఇరాన్ కూడా ప్రతీకార దాడులతో చెలరేగిపోయింది. గల్ఫ్ దేశాలు లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది.

అయితే హోర్ముజ్ జలసంధిని తెరవాలని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. ఒప్పందం చేసుకోకపోతే 48 గంటల్లో ఇరాన్‌ను సర్వ నాశనం చేస్తామని ట్రంప్ బెదిరించారు. అయితే ఒప్పందం చేసుకునేందుకు ఇరాన్ ససేమిరా అంది. ఎట్టి పరిస్థితుల్లో ఒప్పందం చేసుకోబోమని తేల్చి చెప్పింది. తాజాగా ఒప్పందం రద్దు కావడంతో డెడ్‌లైన్‌కు ముందుగానే అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా భీకర దాడులు చేస్తున్నాయి. దీంతో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హర్మ్యూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటుచేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టా÷-గ్గ÷ట్లపైనా అమెరికా-ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్-అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని..ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది. ఆయా దేశాలలోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని..చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

**కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా**

**టెహ్రాన్ :** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా-ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారడు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. ÷రిజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు . కాగా, మోజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై వచ్చిన ఈ వార్తలు ఇరాన్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు. అందువల్ల ఇప్పటికి ఇవి కేవలం నివేదికల ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.

# మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

**నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ**

**ఇంఫాల్ :** ఓ మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్‌జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారని అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సమీపంలోని రెండు ఆయిల్ ట్యాంకర్స్, ట్రక్‌కు నిప్పటించారు. మోయిరాంగ్ పోలీస్ స్టేషన్ సహా ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో టైర్లను తగుల బెట్టి నిరసన వ్యక్తం చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని కేంద్ర బలగాల శిబిరంపై దాడి చేశారు. ట్రోంగ్లాయోబికి సుమారు 200 మీటర్ల దూరంలో ఈ శిబిరం ఉంది. ఆగ్రహించిన పోలీసులు వారిపై కాల్పులకు దిగడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.

# వలస కార్మికులలకు కేంద్రం శుభవార్త

**ఇక నుంచి 5 కెజీల రెండు సిలిండర్ల సరఫరా**

**రాష్ట్రాలకు సూచించిన కేంద్రం**

**న్యూఢిల్లీ :** వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

# పాక్‌లో తీవ్ర ఇంధన కొరత

**లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధింపు**

**ఇస్లామాబాద్ :** హోర్ముజ్ జలసంధి మీదుగా ముడి చమురు, సహజవాయువు రవాణా నౌకల రాకపోకలపై ఇరాన్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రపంచాన్ని ఇంధన సంక్షోభం భయపెడుతోంది. ఇంధన కొరత ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో ప్రభుత్వం తాజాగా లాక్‌డౌన్ తరహా ఆంక్షలకు తెరతీసింది. వాణిజ్య కార్యకలాపాలపై పరిమితులను ప్రకటించింది. విద్యుత్, ఇంధన పొదుపు చర్యలపై సమావేశం నిర్వహించిన అనంతరం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ ఆంక్షలను ప్రకటించారు. రేడియో పాకిస్థాన్ ప్రసారం చేసిన వివరాల ప్రకారం, ఇకపై దేశవ్యాప్తంగా పాక్‌లో మార్కెట్స్, షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలను రాత్రి 8 గంటల కల్లా మూసివేయాల్సి ఉంటుంది. అయితే, డివిజనల్ హెడ్‌క్వార్టర్స్‌కు మాత్రం ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. ఆయా ప్రాంతాల్లో రాత్రి 9 గంటల వరకూ కార్యకలాపాలు కొనసాగించేందుకు అనుమతి ంచింది. ఇక బేకరీలు, ఫుడ్ స్టాల్స్ వంటివి కూడా రాత్రి 10 గంటల కల్లా మూసేయాల్సి ఉంటుంది. ప్రజల ఇళ్లల్లో రాత్రి 10 గంటల తరువాత పెళ్లిళ్లకు సంబంధించి కార్యక్రమాలు ఏవీ నిర్వహించకూడదు. అయితే, ఫార్మసీలు, ఇతర హెల్త్ కేర్ సర్వీసెస్‌కు సంబంధించిన షాపులకు మాత్రం ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

# ముంబైపై రాయల్స్ ఘన విజయం

## జైస్వాల్ అజేయ అర్ధసెంచరీ




**గువాహటి :** ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన పోరులో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తద్వారా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో హ్యాట్రిక్ విజయాలతో రాయల్స్ అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 123/9 స్కోరుకు పరిమితమైంది. బర్గర్, బిష్ణోయ్, సందీప్ రెండేసి వికెట్లు తీశారు. టాపార్డర్ త్రయం రోహిత్‌శర్మ(5), రికల్టన్(8), సూర్యకుమార్(6)తో సహా కెప్టెన్ హార్దిక్‌పాండ్యా(9), తిలక్‌వర్మ(14) ఘోరంగా విఫలమయ్యారు. వర్షం అంతరాయం కారణంగా సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. కాగా ప్రత్యర్థి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. 11 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (32 బంతుల్లో 77లి, 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకానికి తోడు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 39, 1 ఫోర్, 5 సిక్స్‌లు) వీరవిహారంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

### దొరికిన బంతిని దొరికనట్టు..

4, 6, 4, 4, 4.. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్‌కు తొలి ఓవర్లోనే జైస్వాల్ అందించిన ఆరంభమది. 3.2 ఓవర్లకు కుదించిన పవర్ ప్లేలో జైస్వాల్, వైభవ్ కండల్లో కరెంటు నింపుకుని వచ్చినట్టుగా దొరికిన బంతిని దొరికినట్టుగా బౌండరీ లైన్ దాటించడంతో రాయల్స్ రన్‌రేట్ 20కి తగ్గకుండా సాగింది. ఈ మ్యాచ్‌కు ముందు వైభవ్.. బుమ్రాను ఎలా ఎదుర్కొంటాడనేదానిపై అందరూ ఆసక్తిగా ఎదురుచూడగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఈ బీహార్ కుర్రాడు స్టార్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. బుమ్రా, బౌల్ట్‌ను క్లబ్ స్థాయి బౌలర్లుగా మార్చేసి ధనాధన్ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. బుమ్రా బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి నాలుగు బంతుల్లో రెండు భారీ సిక్స్‌లు బాదిన అతడు ఆ తర్వాత బౌల్ట్ ఓవర్లోనూ స్కేర్ లెగ్ మీదుగా కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. శార్దూల్ ఐదో ఓవర్లోనూ 6, 4, 6 దంచిన వైభవ్.. ఆఖరి బంతికి ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా భారీ షాట్ ఆడినా అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న తిలక్ వర్మకు చిక్కడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు ఈ జోడీ 4.6 ఓవర్లలోనే 80 రన్స్ జతచేయడం విశేషం. ఆ తర్వాత జురెల్ (2)ను గజన్‌ఫర్ పెవిలియన్‌కు పంపగా హార్దిక్ 8వ ఓవర్లో బౌండరీతో యశస్వీ వరుసగా రెండో ఫిఫ్టీని పూర్తిచేశాడు. రెండు సిక్స్‌లు, ఒక బౌండరీతో ఊపు మీద కనిపించిన కెప్టెన్ పరాగ్ (20)నూ గజన్‌ఫర్ బోల్తా కొట్టించాడు. శార్దూల్ విసిరిన ఆఖరి ఓవర్లో 18 రన్స్ రాబట్టిన జైస్వాల్.. ఇన్నింగ్స్‌కు అదిరిపోయే ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.




### ముంబై పోరాడినా..

11 ఓవర్లలో 151 పరుగుల ఛేదనతో బరిలోకి దిగిన ముంబైకి ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఆర్చర్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ ఆఖరి బంతికి రికల్టన్‌ను ఔట్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. భారీ సిక్స్‌తో దూకుడు మీద కనిపించిన రికల్టన్..మరో షాట్ ఆడే ప్రయత్నంలో కీపర్ చేతికి చిక్కాడు. వచ్చి రావడంతోనే తనదైన శైలిలో సిక్స్ కొట్టిన సూర్యకుమార్ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. బర్గర్ బౌలింగ్‌లో బౌండరీ దగ్గర ఆర్చర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. రెండు పరుగుల తేడాతో రోహిత్‌శర్మ..సందీప్‌శర్మ బౌలింగ్‌లో వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు, బౌలింగ్ మార్పుగా వచ్చిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ మూడు బంతుల వ్యవధిలో హార్దిక్‌తో పాటు తిలక్‌ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ముంబై 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆఖర్లో రూథర్‌ఫర్డ్(25), నమన్ ధీర్(25) దూకుడుగా ఆడినా..ముంబై గెలుపు వాకిట నిలువలేకపోయింది.

### సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 11 ఓవర్లలో150/3 (జైస్వాల్ 77లి, వైభవ్ 39, గజన్‌ఫర్ 2/21, శార్దూల్ 1/36);

ముంబై: 11 ఓవర్లలో 123/9 (రూథర్‌ఫర్డ్ 25, నమన్ 25, బిష్ణోయ్ 2/25, బర్గర్ 2/21)



# డేవిడ్ వార్నర్‌ను అరెస్ట్

ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ పీకల దాకా మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. సిడ్నీలోని మౌబ్రా ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న వార్నర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వెంటనే స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఆస్ట్రేలియాలో అనుమతించిన దానికంటే దాదాపు రెట్టింపు స్థాయిలో మద్యం సేవించి అతడు డ్రైవింగ్ చేసినట్లు బ్రీత్ అనలైజర్ పరీక్షలో తేలింది. తప్పతాగి కారు నడుపుతూ ఆస్ట్రేలియా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను అతడిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడేందుకు వెళ్లిన వార్నర్, మే నెలలో జరిగే కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లో డేవిడ్ భాయ్ గా విశేష ప్రజాదరణ పొందిన వార్నర్ ఇలా తాగి పట్టుబడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సోషల్ మీడియాలో టాలీవుడ్ పాటలకు డ్యాన్సులు చేస్తూ ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఈ స్టార్ ఆటగాడు, ఇప్పుడు ఏకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్టై పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కడం క్రీడా వర్గాల్లో సంచలనంగా మారింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో మలబార్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపి ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక వ్యాన్ తనిఖీ కేంద్రానికి కొద్దిగా దూరంలోనే ఆగిపోయింది. దీనిని గమనించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వాహనంలో ఉన్న 39 ఏళ్ల వార్నర్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను పరిమితికి మించి మద్యం తాగినట్లు పాజిటివ్ ఫలితం వచ్చింది. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు మౌబ్రా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన మరో పరీక్షలో అతని రక్తంలో 0.1 శాతం ఆల్కహాల్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. చట్ట ప్రకారం ఇది నేరం కావడంతో అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత విచారణ నిమిత్తం నోటీసులు ఇచ్చి పంపించారు.అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులు సృష్టించిన వార్నర్ 2024 జనవరిలో రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా సొంత గడ్డపై పాకిస్థాన్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌తో పాటు వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్ తర్వాత జాతీయ జట్టుకు వీడ్కోలు పలికాడు. అప్పటినుంచి కేవలం ప్రపంచవ్యాప్తంగా జరిగే ప్రైవేట్ టీ20 లీగుల్లో మాత్రమే ఆడుతున్నాడు. ఐపీఎల్, పీఎస్ఎల్ లాంటి టోర్నీల్లో చురుకుగా పాల్గొంటూనే మరోవైపు క్రికెట్ వ్యాఖ్యాతగా మీడియా రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాడు. మైదానంలో ఎంతో చురుకుగా ఉండే ఈ స్టార్ ఓపెనర్ తాజా వివాదంలో చిక్కుకోవడం అతని కెరీర్‌పై మచ్చ తెచ్చింది. పుష్ప సినిమా డైలాగులు చెబుతూ అల్లు అర్జున్ అభిమానిగా మారిన వార్నర్, తన విభిన్నమైన వ్యవహారశైలితో నిత్యం వార్తల్లో నిలుస్తాడు. అయితే తాజా అరెస్ట్ తో అతని అభిమానులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. మే నెలలో రాబోయే కోర్టు తీర్పును బట్టి వార్నర్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.




# వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రేలకు బీసీసీఐ షాక్

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతిష్టాత్మకంగా భావించే అండర్-25 జట్టు ఎంపికలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాబోయే కాలంలో భారత టెస్ట్ జట్టుకు వెన్నెముకగా నిలిచే ఆటగాళ్లను గుర్తించేందుకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన 25 మంది సభ్యుల జాబితాలో వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే పేర్లు లేకపోవడం గమనార్హం. శ్రీలంకలో జరగనున్న రెడ్ బాల్ క్రికెట్ సిరీస్ కోసం భారత అండర్-19, అండర్-25 జట్లు పయనమవనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది.ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ ముగిసిన వెంటనే, బీసీసీఐ ఈ ప్రత్యేక నాలుగు రోజుల మ్యాచ్‌ల టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 64 మంది అత్యుత్తమ యువ క్రికెటర్లను నాలుగు జట్లుగా విభజించి ఈ పోటీలు నిర్వహిస్తారు. ఈ ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఒక ప్రత్యేక ప్రాతిపదికను అనుసరించారు. అందులో 25 మంది ఆటగాళ్లు సి.కె. నాయుడు ట్రోఫీ, అండర్-23 వన్డే మ్యాచ్‌ల నుంచి, మరో 25 మంది ఆటగాళ్లను రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ వంటి ప్రధాన టోర్నీల నుంచి ఎంపిక చేశారు. మిగిలిన 14 స్థానాలను ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా భర్తీ చేయనున్నారు.వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి మేటి ఆటగాళ్లను ప్రాథమిక జాబితాలో చేర్చకపోవడానికి ఒక బలమైన కారణం ఉంది. వీరిద్దరూ ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బిజీగా ఉన్నారు. ఆయుష్ మ్హాత్రే చెన్నై సూపర్ కింగ్స్ తరపున, వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత ఎంపిక చేసే టాప్ 14 మంది ఆటగాళ్ల జాబితాలో వీరి పేర్లు ఉండే అవకాశం మెండుగా ఉందని సమాచారం. కాబట్టి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.ప్రస్తుతం ఎంపికైన జట్టులో ఆయుష్ దోసేజా, యశ్ ధుల్, మయాంక్ వర్మ, ఆయుష్ పాండే, శాశ్వత్ రావత్, మహేష్ పిథియా, రాజ్ లింభాని, ఆర్య దేశాయ్, సిద్ధార్థ్ దేశాయ్, ఆకిబ్ ఖాన్, కార్తీక్ యాదవ్, విద్యాధర్ పాటిల్, కె. హిమతేజ, భువనగిరి పున్నయ్య, పుఖరాజ్ మాన్, యశవర్ధన్ దలాల్, పార్థ్ వత్స్, ఈడెన్ ఆపిల్ టామ్, హిమాన్షు సింగ్, అమన్ మోఖడే వంటి ఆటగాళ్లు ఉన్నారు.

# జట్టులో చేరనున్న మిచెల్ స్టార్క్




ఈ ఐపీఎల్ సీజన్ లో ఇప్పటివరకు బోణీ కొట్టని జట్లు అంటూ ఏవైనా ఉన్నాయంటే అవి చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్. ఈ రెండు జట్లు కూడా ఆడిన మ్యాచ్ లన్నీ ఓడిపోయాయి. చెన్నై మూడు, గుజరాత్ రెండింట్లో పరాజయం పాలయ్యాయి. తమ ప్రత్యర్థులకు రెండేసి చొప్పున పాయింట్లను ధారదాత్తం చేశాయి. ఈ వరుస ఓటములు చెన్నై సూపర్ కింగ్స్ ను మాత్రం తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. హేటర్స్ కు ట్రోలింగ్ స్టఫ్ ను అందించాయి.ఈ పరిస్థితుల మధ్య ఈ రెండు జట్లనూ ఎదుర్కొనబోతోంది ఢిల్లీ కేపిటల్స్. దెబ్బతిన్న పులుల్లా ఉన్న గుజరాత్, చెన్నైతో ఈ నెల 8, 11 తేదీల్లో మ్యాచ్ లను ఆడాల్సి ఉంది. 18న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టబోతోంది. ఇప్పుడీ మూడు మ్యాచ్ లకు కూడా స్టార్ పేస్ బౌలర్ మిఛెల్ స్టార్క్ దూరం అయ్యాడు. ఇప్పటివరకు ఆడిన రెండింట్లోనూ నెగ్గి దూకుడు మీదున్న ఢిల్లీ కేపిటల్స్.. తన జైత్రయాత్రను కొనసాగించాలంటే స్టార్క్ అవసరం ఎంతైనా ఉంది.ఈ స్టార్ ఆటగాడు మరో మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని తెలుస్తోంది. భుజం, మోచేతి గాయాల నుంచి ఆస్ట్రేలియాలో ట్రీట్మెంట్ తీసుకున్నాడు. అక్కడే కోలుకుంటోన్నాడు. ఇప్పటివరకు జట్టుతో కలవలేదు కూడా. అత్యంత కీలకమైన ఈ మూడు మ్యాచ్ లకూ ఈ స్టార్ బౌలర్ సేవలను జట్టు కోల్పోనుంది. మిచెల్ స్టార్క్ ఈ సీజన్‌లో ఏదో ఒక సమయంలో జట్టుతో చేరతాడని ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ఆశాభావంతో ఉంది.ఈ ఎడమచేతి వాటం బౌలర్ లేనప్పటికీ అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. బౌలింగ్ యూనిట్ అద్భుత ప్రదర్శన చేసింది. ముఖేష్ కుమార్, లుంగి ఎన్‌గిడి, టీ నటరాజన్ కీలక ఓవర్లలో కచ్చితత్వంతో బౌలింగ్ చేశారు. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, విప్రజ్ నిగమ్ వంటి స్పిన్నర్లు మిడిల్ ఓవర్లల్లో సత్తా చాటుతున్నారు. చెన్నై, గుజరాత్, బెంగళూరుతో ఆడాలంటే మాత్రం అదనపు బౌలింగ్ వనరులు తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో స్టార్క్ జట్టులో చేరితే బాగుంటుందని ఆశించింది గానీ, అది సాధ్యపడేలా లేదు. గాయంతో ఉన్నప్పటికీ స్టార్క్ జట్టు యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నాడు. ప్రస్తుతం భుజం, మోచేతికి అయిన గాయం నుంచి కోలుకుంటున్నానని, వీలైనంత త్వరగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరడానికి కట్టుబడి ఉన్నానని స్టార్క్ స్పష్టం చేశాడు. ఈ సీజన్ ప్రారంభంలో అందుబాటులో లేనందుకు అభిమానులకు క్షమాపణ సైతం చెప్పాడు.

# బీసీసీఐతో కాళ్ల బేరానికి బంగ్లాదేశ్..

భారత్ క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)తో సంబంధాలను మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టింది. భారత్‌కు వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) చీఫ్ అమీనుల్ బుల్బుల్‌పై వేటు వేసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆడేందుకు భారత్‌కు వెళ్లమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని అప్పట్లో అమీనుల్ బుల్బుల్ డిమాండ్ చేశాడు.పాకిస్థాన్ మాటలు పట్టుకొని టోర్నీ నుంచి తప్పుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని తప్పుబట్టిన బంగ్లాదేశ్ నయా ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకుంది. బోర్డు కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేసి బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలో 11 మంది సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బీసీబీలో తదుపరి ఎన్నికలు జరిగే వరకు ఈ కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందని పేర్కొంది.తమీమ్ ఇక్బాల్ నేతృత్వంలోని ఈ బోర్డులో రష్నా ఇమామ్, మీర్జా యాసిర్ అబ్బార్, సయ్యద్ ఇబ్రహీం అహ్మద్, ఇస్రాఫిల్ ఖోస్రూ, మిన్హాజుల్ అబెడిన్ నాన్నూ, అథర్ అలీ ఖాన్‌లు ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో జాతీయ ఎన్నికల జరగ్గా.. కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. అంతకుముందు మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంది. భారత్‌పై అక్కసుతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ టోర్నీని బహిష్కరించింది. ఐపీఎల్ 2026 సీజన్ నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించాలని కేకేఆర్ టీమ్‌ను బీసీసీఐ ఆదేశించడంతో వివాదం మొదలైంది. ఈ నిర్ణయంపై ఆగ్రహించిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌లో పర్యటించకూడదని నిర్ణయించుకుంది. అయితే కొత్త క్రీడా మంత్రి అమీనుల్ హక్ ఐసీసీతో సంప్రదింపులు జరిపి బోర్డు నాయకత్వంలో మార్పులు ఉంటాయని సూచించారు. భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి బంగ్లాదేశ్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలో ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల ప్రసారంపై ఉన్న నిషేధాన్ని తొలగించింది. గతంలో టీ20 ప్రపంచకప్ విషయంలో బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన తమీమ్ ఇక్బాల్‌కు బోర్డు బాధ్యతలు అప్పగించింది. గతంలో తమీమ్ ఇక్బాల్ భారత్‌కు అనుకూలంగా మాట్లాడారని బీసీబీ డైరెక్టర్ ఎం. నజ్ముల్ ఇస్లాం ఆయన్ని "ఇండియన్ ఏజెంట్" అని విమర్శించడం పెద్ద వివాదానికి దారితీసింది. ఆ తర్వాత నజ్ముల్‌ను పదవి నుంచి తొలగించారు.రాబోయే కాలంలో మూడు వన్డేలు, టీ20 సిరీస్ కోసం భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతేడాది రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత జట్టు పర్యటన వాయిదా పడింది. అలాగే బంగ్లాదేశ్ మహిళల జట్టు భారత పర్యటన కూడా రద్దయింది. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు మెరుగవుతుండటంతో తిరిగి క్రికెట్ సంబంధాలు కూడా మొదలవ్వనున్నాయి.

## అట్లీ బన్నీ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్.

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ క్రేజ్ ఇప్పుడు దేశ సరిహద్దులు దాటేసింది. 'పుష్ప' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన బన్నీ, ఇప్పుడు తన పుట్టినరోజు (ఏప్రిల్ 8) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ ఇవ్వనున్నారు. కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీతో బన్నీ చేయబోయే సినిమాపై సోషల్ మీడియాలో భారీ ఎత్తున హైప్ నడుస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్ నుంచి ఒక స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయడంతో సోషల్ మీడియా మొత్తం బన్నీ నామస్మరణతో మారుమోగిపోతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ క్వీన్ దీపికా పదుకొణే హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఒక హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. ఇక 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో వెయ్యి కోట్లు కొల్లగొట్టిన అట్లీ, ఇప్పుడు బన్నీతో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారా అని యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఈ చిత్రంలో భారీ వీఎఫ్ఎక్స్ వర్క్ మరియు అట్లీ మార్క్ మాస్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉండబోతున్నాయని సమాచారం. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా టైటిల్ మరియు గ్లింప్స్ అనౌన్స్‌మెంట్‌కు ముహూర్తం ఖరారైంది. ఇక ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ సినిమా పేరును అధికారికంగా ప్రకటించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లింది. ముఖ్యంగా ఈ చిత్రానికి కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండటం మరో విశేషం. యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ బన్నీకి ఎలాంటి మాస్ బీట్స్ ఇస్తారో చూడాలని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. మొత్తానికి అల్లు అర్జున్ పుట్టినరోజు నాడు తన అభిమానులకు కావలసిన అసలైన 'దావత్' రెడీ అయి-పోయింది. ఒకవైపు 'పుష్ప-3' కోసం వెయిట్ చేస్తున్న ఫ్యాన్స్‌కు, అట్లీతో ఈ కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ డబుల్ ధమాకా అనే చెప్పాలి. బన్నీ స్టైల్, అట్లీ టేకింగ్ తోడైతే ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర రికార్డులు తిరగరాయడం ఖాయమనిపిస్తోంది. మరి రేపు ఉదయం 11 గంటలకు బయటకు రాబోయే ఆ పవర్‌ఫుల్ టైటిల్ ఏంటో తెలుసుకోవాలంటే కొన్ని గంటలు వేచి చూడాల్సిందే!



# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ

'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట.అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.





# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.



## స్త్రీలకు అవమానం.. నోరా ఫతేహీపై మహిళా కమిషన్ సీరియస్!

సినిమా ప్రమోషన్ల కోసం వివాదాస్పద సాహిత్యం లేదా దృశ్యాలను విడుదల చేయడం అనేది నేడు ఒక బాధ్యతారాహిత్యమైన -పబ్లిసిటీ స్టంట్-గా మారుతోంది. సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సి) నిబంధనలు ప్రధానంగా థియేటర్లలో ప్రదర్శించే వెర్షన్‌కే పరిమితం కావడంతో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో విడుదలయ్యే ప్రమోషనల్ కంటెంట్‌ను నిర్మాతలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ గ్రే ఏరియాను అడ్డుకోవడానికి సెన్సార్ బోర్డు తన పరిధిని డిజిటల్ మాధ్యమాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని విశ్లేషిస్తున్నారు. కేవలం కట్స్ చెప్పడమే కాదు.. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై భారీ జరిమానాలు విధించడం ద్వారానే ఇటువంటి ధోరణులకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. మహిళా కమిషన్ వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థల జోక్యం ఇక్కడ అత్యంత కీలకం. సెన్సార్ బోర్డు కేవలం సాంకేతికపరమైన తనిఖీలు చేస్తే.. మహిళా కమిషన్ సమాజంలోని నైతిక విలువలు, మహిళల గౌరవానికి భంగం కలిగే ప్రతి సందర్భంలోనూ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తుంది. -కేడీ - ది డెవిల్- సినిమా విషయంలో నోరా ఫతేహి, సంజయ్ దత్ వంటి అగ్ర తారలను నేరుగా విచారణకు పిలవడం వల్ల సృజనాత్మకత పేరుతో అశ్లీలతను ప్రోత్సహించే మేకర్స్‌కు ఒక బలమైన హెచ్చరిక వెళ్లినట్టయింది. చట్టపరమైన చర్యల భయం ఉన్నప్పుడే బాధ్యతాయుతమైన సినిమా మేకింగ్ సాధ్యమవుతుంది. ఈ కేసుకు సంబంధించి జరిగిన తొలి విచారణకు చిత్ర దర్శకుడు ప్రేమ్, రచయి-ఎత రకీబ్ ఆలం, నిర్మాతలు హాజరై, సమాజంపై ఈ పాట ప్రతికూల ప్రభావం చూపిందని ఒప్పుకుంటూ లిఖితపూర్వక క్షమాపణలు తెలిపారు. అయితే నటి నోరా ఫతేహి ఈ విచారణకు గైర్హాజరు కావడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమె తరఫున న్యాయవాది హాజరైనా లాయర్ ప్రాతినిధ్యాన్ని తిరస్కరిస్తూ ఏప్రిల్ 27న నోరా వ్యక్తిగతంగా కమిషన్ ముందుకు రావాలని తుది అవకాశం ఇచ్చింది. అలాగే నటుడు సంజయ్ దత్‌ను కూడా ఏప్రిల్ 8న ప్యానెల్ ముందు హాజరు కావాల్సిందిగా కమిషన్ ఆదేశించింది.

# పారమితలో విద్యార్థుల సృజనాత్మకతకు పట్టం

## ఘనంగా ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ అవార్డుల ప్రధానోత్సవం




తిమ్మాపూర్, జనతా న్యూస్ కరీంనగర్ కార్పొరేషన్ అల్గునూర్ లోని పారమిత వరల్డ్ స్కూల్ లో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన 'ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసనం' (పిబిఎల్) అవార్డుల ప్రధానోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యసనం (పిబిఎల్) అనేది పారమిత పాఠశాలల్లో అమలు చేయబడుతున్న బాలల కేంద్రీకృత, పరిశోధన ఆధారిత పాఠ్యప్రణాళిక. అర్థవంతమైన అభ్యసనం ద్వారా పిల్లలను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. పారమిత పాఠశాలలు తమ వార్షిక పిబిఎల్. అవార్డుల ప్రధానోత్సవాన్ని నిర్వహించి, విజేతలను సత్కరించారు. పిబియల్ ఫైనల్ ఎగ్జిబిషన్‌లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు 200 మంది విద్యార్థులతో కూడిన 80 ఉత్తమ ఇన్నోవేటివ్ గ్రూప్ల ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు తెలిపారు. పరిశోధన, సామాజిక శాస్త్రాల అనుసంధానం, సేకరణ వంటి వివిధ విభాగాల్లో ఈ ప్రాజెక్టులు విద్యార్థుల నైపుణ్యాలను, జ్ఞానాన్ని, ప్రతిభను చాటి చెప్పాయని అన్నారు. ప్రముఖ విద్యాసంస్థల ప్రొఫెసర్ల బృందం ఈ ప్రాజెక్టులను మూల్యాంకనం చేసి ప్రతి తరగతి నుండి మొదటి మూడు ప్రాజెక్టులను ఎంపిక చేసి 60 మంది విద్యార్థులతో కూడిన 12 ప్రాజెక్టులను, సృజనాత్మక విధానం, అత్యుత్తమ పనితీరు, వినూత్న పరిష్కారాల ఆధారంగా ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ ద్వారా పారమిత పాఠశాల తమ విద్యార్థులకు పరిశోధన ఆధారిత విద్యను అందిస్తోందని, ఇది ప్రస్తుత సామాజిక సవాళ్లకు వినూత్నమైన పరిష్కారాలను కనుగొనడానికి వారిని సిద్ధం చేస్తుందని పిబిఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసన ద్వారా గత 10 సంవత్సరాలుగా దాదాపు 30 వేలకు పైగా విద్యార్థులు మరియు 500 కు పైగా ఉపాధ్యాయులు ప్రయోజనం పొందారని అన్నారు. అనంతరం విజేతలకు అవార్డులు, సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీకర్, బాలాజీ, ప్రశాంత్, గోపీకృష్ణ, పి.బి.ఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు, పిబిఎల్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరండి

## హుస్నాబాద్ ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు



హుస్నాబాద్,జనత న్యూస్: 'అలర్ట్ టుడే ఎలైవ్ టుమారో.. అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన ఉ ద్దేశమని ఆయన స్పష్టం చేశారు.సిద్దిపేట జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ జరిమానాలు ఇతర జిల్లాల కంటే అధికంగా ఉన్నాయని, ఉదయం నుంచి రాత్రి వరకు రెక్కల కష్టం మీద బతికే పేద ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడిపి తమ కష్టార్జితాన్ని జరిమానాల రూపంలో పోగొట్టుకోవద్దని హితవు పలికారు.అతివేగం అత్యంత ప్రమాదకరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వడం, డివైడర్లు ఉన్న చోట మధ్యలో నుండి ప్రమాదకరంగా వాహనాలు తిప్పడం వంటి పనులు చేయవద్దని హెచ్చరించారు. ప్రతి వాహనానికి ఖచ్చితంగా ఇన్సూరెన్స్ ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వివరించారు.అనంతరం వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు వాహనదారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లుతో పాటు ట్రాఫిక్ సిబ్బంది శేఖర్, దూదియ నాయక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైక్లింగ్ ర్యాలీ



కరీంనగర్, ఏప్రిల్ 07: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హెల్తీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. వి. నరేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని, సైక్లింగ్ అలవాటు చేసుకోవడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో సైక్లింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, మన దేశంలో కూడా ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సైక్లింగ్ వల్ల శారీరక దృఢత్వం పెరిగి రోజువారీ పనులను సమర్థవంతంగా నిర్వహించగలమని పేర్కొన్నారు. సైక్లింగ్‌ను ప్రతి ఒక్కరు తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి ప్రారంభమై బస్టాండ్, తెలంగాణ చౌక్, ఆర్ అండ్ బి చౌరస్తా, కోర్ట్ చౌరస్తా మీదుగా రెనీ హాస్పిటల్ వరకు సాగింది. సుమారు 150 మంది సైక్లిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డా. బంగారి స్వామి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ సంజీవ్, ట్రాఫిక్ ఎస్ఐ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారికి త్వరలో ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన కలెక్టర్,ఎమ్మెల్యే



తిమ్మాపూర్, జనతా న్యూస్ తిమ్మాపూర్ మండలంలోని అల్గునూరు, నల్లగొండ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. అల్గునూరు గ్రామంలో నాలుగు ఎకరాలు, నల్లగొండలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలలాను పరిశీలించారు. ఈ గ్రామాల్లో అనువైన ప్రదేశాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు ఇచ్చేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కలెక్టర్ ని కోరారు. అసైన్ మెంట్ కమిటీ ఆమోదం మేరకు సత్వర చర్యలు తీసుకుంటామని, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి అనుమతులు పొందేలా చూస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నివేశన స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించడమే కాకుండా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ సొంతి ఇంటికలను సాకారం చేయాలనే సంకల్పంతో ఈ స్థలాల పరిశీలన చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, తిమ్మాపూర్ తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు ఎ.రమేశ్ యాదవ్, గోపు మల్లారెడ్డి, కంది లక్ష్మినారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి,చిందం కిష్టయ్య, పి.శ్రీకాంత్, నాగేందర్, తాళ్లపల్లి శ్రీనివాస్ రావు, నల్లగొండ సర్పంచ్ మారుతితోపాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు

# భూ సమస్యకు ముగింపు పలికిన తహసిల్దార్



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని కల్లెపెల్లి రెవిన్యూ గ్రామంలోని, గూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల వివిధ సర్వే నెంబర్లలో గల 63 ఎకరాల, 18 గుంటల భూమిని 9 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఎల్పీఎస్ కింద భూమి లేని నిరుపేదలకు కొనుగోలు చేసి ఇచ్చింది. మ్యుటేషన్ సర్వే పెండింగ్ ఉండడంతో కొంతమంది లబ్ధిదారులు ఆర్టిఐ ఫౌండర్ ఒ జాతీయ మాల మహానాడు తెలంగాణ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాసురి మల్లికార్జున్ ను సంప్రదించడంతో ఆయన బాధితుల తరఫున 9 సంవత్సరాల నుండి న్యాయ పోరాటం చేయడంతో మంగళవారం ఆయన న్యాయ పోరాటం ఫలించిందని పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఎందరో అధికారులు బదిలీ అయినారు, కానీ ఈ భూ సమస్య పరిష్కారం కాలేదని, కానీ ప్రస్తుత తహసిల్దార్ శ్రీకాంత్ న్యాయస్థానాల తీర్పులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితులకు భూమి సరిహద్దులు చూపించి శాశ్వత పరిష్కారం చూపారని పేర్కొన్నారు. తహసిల్దార్ శ్రీకాంత్ కు , రెవెన్యూ సిబ్బందికి బాధితుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంకాల బాలయ్య, రాకం రాజు, మోదుగుపల్లి రాజు, కొంపల్లి రాజు, మంకాల బాబు, మంకాల భూపేందర్, ఉ ప్పులేటి శ్రీనివాస్, మెరుగు కనకయ్య, మాంకాల బయన్న, మెరుగు భాస్కర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు సభ్యులు



జనతన్యూస్ బెజ్జంకి : మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన 5 గురు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మంగళవారం మానకొండూరు శాసనసభ్యులు ఒ టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ముత్త బీరయ్య, దయ్యాల ఐలవ్వ, ఏనుగుల అనిత, నల్లగొండ రాములు, జనగాం లక్ష్మి కాంగ్రెస్ కండువా కప్పుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, తోటపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దయ్యాల ఐలేష్, నాయకులు బైరా సంతోష్, గుంటి అంజి, గుంటి అశోక్, గుంటి ఓదయ్య, ఒగ్గు శ్రీను తదితల్లి పాల్గొన్నారు.

# ముందస్తు 5% రాయితీని సద్వినియోగం చేసుకోండి: మేయర్ పిలుపు



కరీంనగర్, ఏప్రిల్ 08: నగరపాలక సంస్థ 2026--2027 ఆర్థిక సంవత్సరానికి అందిస్తున్న 5 శాతం ముందస్తు రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పౌర సేవా కేంద్రంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పన్ను చెల్లింపు కౌంటర్లను మేయర్ పరిశీలించారు. ఎనిమిది ప్రత్యేక కౌంటర్ల వద్ద పన్నులు చెల్లించేందుకు వచ్చిన పౌరులతో మాట్లాడి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలను తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో ఎర్లీ బర్డ్ 5 శాతం రాయితీపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కౌంటర్ల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైతే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, వార్డు అధికారుల విధుల్లో మార్పులు చేయాలని కమిషనర్‌కు సూచించారు. కార్యాలయానికి రాలేని ప్రజలకు వార్డు అధికారులు అందుబాటులో ఉండాలని, ఆన్‌లైన్ చెల్లింపులను సులభతరం చేయాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి రాయితీపై అవగాహన కల్పించి పన్ను వసూళ్లను పెంచాలని అధికారులకు సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, మహిళలకు త్రాగునీరు, కూలర్లు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. 5 శాతం రాయితీ గడువు ఏప్రిల్ 30తో ముగియనున్నందున ఆలోపు పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యుత్తమ వైద్య సేవలతో ప్రజల మన్ననలు పొందాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, ఏప్రిల్ 08: వైద్య సిబ్బంది ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కరీంనగర్‌లోని హుస్సేన్‌పురా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ముంతాజ్ ఖానా)ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. రోజువారీ రోగుల సంఖ్య, మందుల లభ్యత, ల్యాబ్ పరీక్షల నిర్వహణ, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రుల ప్రతిష్టను పెంచేలా నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు వైద్యులను దేవుళ్లుగా భావిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది ఓర్పుతో సేవలు అందించి మంచి గుర్తింపు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, పీఓ ఎంహెచ్ఎన్ సనా, మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన, ఓటర్ మ్యాపింగ్ పకడ్బందీగా నిర్వహించాలి: కమిషనర్



కరీంనగర్, ఏప్రిల్ 08: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టబోయే జనగణన ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పలు విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జనగణనపై సలహాలు, సూచనలు ఇస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో భూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు), సూపర్‌వైజర్లతో మరో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఓటర్ మ్యాపింగ్ పురోగతిపై చర్చించి, అనర్హుల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 15లోగా సమగ్ర సవరణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా జనగణనను కచ్చితంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డివిజన్ వారీగా నివాస గృహాల జాబితా సిద్ధం చేసి, బ్లాకులుగా విభజించాలని, ఒక్కో బ్లాక్‌లో 120--150 ఇళ్లు, 700--750 జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సెన్సస్ డేటా నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ యాప్‌లు, డిజిటల్ ఫారమ్‌ల వినియోగంపై ఎన్యూమరేటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. నిర్ణీత గడువులో డేటా సేకరణ పూర్తి చేసి, ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జనగణన ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఎన్యూమరేటర్లకు సహకరించేలా చూడాలని తెలిపారు. ఓటర్ మ్యాపింగ్‌లో భాగంగా ఇంటింటికి వెళ్లి వివరాలను నవీకరించాలని, ఖచ్చితమైన సమాచారంతో పారదర్శక ఓటర్ జాబితాను రూపొందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బిఎల్ఓలు, సూపర్‌వైజర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, టౌన్ ప్లానింగ్ డీసీపీ బషీరొద్దిన్, ఎంఆర్ఓలు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఉత్సవ కమిటీల ఎన్నిక....

జనత న్యూస్ బెజ్జంకి: మండల కేంద్రంలో ఏప్రిల్ 11 మరియు 14 తేదీలలో జ్యోతిరావు పూలే,మరియు అంబేద్కర్ జయంతి ఉత్సవ వేడుకలకు సంబంధించిన ఉత్సవ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ కమిటీలో పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ గా ఐలేని శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గా మచ్చ శేఖర్,ప్రధాన కార్యదర్శిగా ఇస్కిల్ల ఐలయ్య,కార్యదర్శిగా జనగాం శంకర్,కోశాధికారిగా తిప్పారపు శ్రీనివాస్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి చైర్మన్ గా బొల్లం శ్రీధర్ పెద్దన్న, వైస్ చైర్మన్ గా తిప్పారపు మహేష్,ప్రధాన కార్యదర్శిగా పొట్లపెల్లి లక్ష్మణ్,కార్యదర్శిగా బొర్ర సురేష్ కుమార్,కోశాధికారిగా లింగాల బాబు, ఉత్సవ కమిటీల సమన్వయ కర్తలుగా లింగాల లక్ష్మణ్,వడ్లూరి పర్శరాములు,లింగాల శ్రీనివాస్,బోనగిరి రూపేష్,జేరిపోతుల మధు,దీటి బాలనర్సు,లింగాల సురేష్,బొమ్మిడి సాయి కృష్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఎన్నుకోబడిన ఈ ఉత్సవ కమిటీ నాయకులు మహనీయుల జయంత్యోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, ప్రజా సంఘాల నాయకులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన గోడ పోస్టర్ ఆవిష్కరణ



కరీంనగర్, ఏప్రిల్ 08: తిమ్మాపూర్ మండలం పర్లపల్లి ఉపమండలం నల్లగొండలోని శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 11న జరగనున్న హిందూ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన గోడ పోస్టర్‌ను మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి బాధ్యులు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 11న దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హిందూ ధర్మమే దేశానికి ఆత్మ అని, హిందూ సంస్కృతి, సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. హిందువులు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఆత్మవిశ్వాసం, ఐకమత్యం పెంపొందించడం, దేవాలయ వ్యవస్థను బలోపేతం చేయడం, సామాజిక సమరసతను నెలకొల్పడం, కుటుంబ వ్యవస్థను బలపరచడం, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు బోనాల మోహన్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, చింతం శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లగొండ గ్రామ సర్పంచ్ జినుక మారత్, పర్లపల్లి సర్పంచ్ సూరం స్వప్న మహేందర్ రెడ్డి, మట్టపల్లి సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్, మల్లాపూర్ సర్పంచ్ మామిడి మమత సతీష్ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి



ఖమ్మం, ఏప్రిల్ 08: కరోనా సమయంలో నిలిపివేసిన జర్నలిస్టుల రైల్వే ప్రయాణ రాయితీలను పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డిని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ప్రతినిధులు కోరారు. మంగళవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసిన డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వరరావు, జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో-కన్వీనర్లు అమరనేని రామకృష్ణ, నాగరాజు దేవర, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు బొడ్డుపల్లి రవీందర్ తదితరులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు దశాబ్దాలుగా అందుబాటులో ఉన్న రైల్వే ప్రయాణ రాయితీలను కరోనా సమయంలో తాత్కాలికంగా నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినప్పటికీ, జర్నలిస్టులకు రాయితీలు ఇంకా పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో వార్తల సేకరణ కోసం జర్నలిస్టులు నిరంతరం ప్రయాణాలు చేయాల్సి ఉంటుందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల జర్నలిస్టులకు ఈ రాయితీలు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరమని వివరించారు. రాయితీలు నిలిపివేయడంతో జర్నలిస్టులపై అదనపు భారం పడుతోందని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, సమస్య తన దృష్టిలో ఉందని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైల్వే పాసుల పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సైబర్ నేరాలపై ఉక్కుపాదం: బ్యాంకర్లతో సీపీ సమీక్ష



కరీంనగర్, ఏప్రిల్ 07: సైబర్ నేరాలను అరికట్టడంలో భాగంగా బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా ఉండి పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. ఆదివారం కమిషనరేట్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన "ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0"లో భాగంగా 4 బ్యాంకు శాఖల్లో 34 మ్యూల్ ఖాతాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసుల్లో ఇప్పటివరకు 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 26 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నిందితులు సేవింగ్స్, కరెంట్ ఖాతాలను సులభంగా తెరుస్తున్న నేపథ్యంలో, ఇకపై ఖాతాల ప్రారంభంలో కఠినంగా స్క్రూటినీ చేయాలని సూచించారు. ముఖ్యంగా కరెంట్ ఖాతాల విషయంలో డాక్యుమెంట్ వెరిఫికేషన్‌తో పాటు సైట్ వెరిఫికేషన్ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. కొన్ని కేసుల్లో బ్యాంకు సిబ్బంది నిందితులకు సహకరిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్న సీపీ, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే గుర్తించిన ఖాతాలతో పాటు మిగిలిన అనుమానాస్పద ఖాతాలను "ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0"లో భాగంగా క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏటీఎం కేంద్రాల్లో సీసీటీవీ పర్యవేక్షణను బలోపేతం చేయాలని, సైబర్ నేరాల నివారణకు సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. సైబర్ నేర రహిత కరీంనగర్ లక్ష్యంగా పోలీసులు, బ్యాంకింగ్ వ్యవస్థ కలిసి పనిచేయాలని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com